క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న గ్రామస్తులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని గోదావరి గట్టు వద్ద గల గౌతమేశ్వరస్వామి ,సత్యన్నారాయణ స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. మహాలయ అమావాస్య రోజున చేసే అన్నదానం సకల దేవతలతో పాటు పితృ దేవతల అనుగ్రహాన్ని కలిగిస్తుందని పురాణ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ పేర్కొన్నారు. గౌతమేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు. కవల శ్రీనివాస్, గణపతి యువజన సంఘం సభ్యులు, రేకపల్లి వీరాస్వామి మాస్టారు దూడల మునేశ్వరరావు సిద్ధంశెట్టి కష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం విత్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లోకల్ ఫీడర్‌పై ఆర్డీడీఎస్ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ఆసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గొన్నాబత్తుల నంద కిషోర్ ఆర్థిక సహకారంతో ఆదివారం రోగులకు పౌష్టికారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి ప్రతాప్, గాజుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు బీమా చేయించుకోవాలి

తాళ్లపూడి: గేదెలకు సోకిన వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో పెద్దేవంలో ఆదివారం అనారోగ్యానికి గురై మృతి చెందిన పాడిగేదుల రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పాడి పరిశ్రమనే జీనాధారంగా బ్రతుకుతున్నామని నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులో నీరు కలుషితమయిందని ఆరోపణల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసి పరీక్షలకు పంపిచామన్నారు. మృతి చెందిన గేదెల్లో థైలీరియాసిస్ అనేవ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించారన్నారు. దీంతో ఆ దిశగా పశువులకు మందులు, వ్యాక్సిన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాడి రైతులు పశువులకు బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎంపీడీవో వెణుగోపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు, గ్రంథాలయ సిబ్బంది

చాగల్లు: చంద్రవరం శాఖా గ్రంథాలయంలో ఆధునిక తెలుగు కవి గురజాడ అప్పారావు 163వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి గ్రంథ పాలకుడు కే.సుమన్ కుమార్, రీడర్ ఫారమ్ సభ్యులు అన్నమరెడ్డి సుబ్బారావు, నిడదవోలు సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ రచించిన కన్యాశుల్కం ప్రజా జీవనాన్ని ఎంతో ప్రభావితం చేసిందని, తన రచనలు, గేయాల ద్వారా సమాజంలో మార్పుకు శ్రీకారం చుట్టిన కవిగా చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.

విద్యార్థి బలవన్మరణం

సీతానగరం: సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించిందన్న నెపంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గడ్డి మందు తాగిన వంగలపూడికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సుంకవల్లి నరేంద్రకుమార్(20) రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. హెచ్‌సీ రేలంగి శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో నరేంద్రకుమార్ బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్ ఇవ్వడానికి తల్లి నిరాకరించడంతో శనివారం సాయంత్రం నరేంద్రకుమార్ మనస్తాపం చెందాడు. పొలం కోసం తెచ్చిన గడ్డి మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడినికుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అమ్మా భవానీ.. సదా స్మరామి

- శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు
- భక్తిశ్రద్ధలతో దీక్షల స్వీకరణ
- దసరా సెలవులతో నందడిగా పుణ్యక్షేత్రాలు

నిడదవోలు: దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. నియోజవర్గంలో పల్లె పల్లెలో వివిధ అమ్మవారి ఆలయాల వద్ద శరన్నవరాత్ర శోభ సంతరించుకుంటుంది. పదిరోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఉత్సవాలకు పట్టణంలోని ప్రధాన ఆలయాలను ముస్తాబు చేశారు. పట్టణంలో వివిధ సెంటర్లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ సెట్టింగులు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆలయాలు ఉత్సవ శోభను సంతరించుకున్నాయి. పట్టణంలో రైల్వే సెంటర్‌లో వేంచేసిన కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని చింతచెట్టు వీధిలో 32వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని పాటిమీద సెంటర్‌లో భీమదొరతూము సెంటర్లో వేంచేసియున్న దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దుర్గ భవాని దీక్షాపీఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసిన దేవతామూర్తుల విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 8 అడుగుల దుర్గాదేవి విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

నంగాలమ్మ అమ్మవారు

నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలను సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేది వరకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 4:59 గంటలకు కలస ముహూర్తంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. కలస ముహూర్తానికి 50 మంది భక్తులు అమ్మవారి మాల ధరించి 11 రోజుల పాటు కుంకుమ పూజలు, ప్రతిరోజు డప్పులతో హారతులు వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అమ్మవారి సేవకులు కోరారు.

కోటసత్తెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భక్తుల ఎవరికి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఆలయ ప్రాంగణంలో భారీ విద్యుత్తు దీపాలంకరణలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 22వ తేదీ ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతులచే కలస స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ప్రతి రోజు అమ్మవారికి సహస్రనామ పూజలతో పాటు ఉదయం చండీపారాయణం, సాయంత్రం హోమాలు నిర్వహిస్తారు. 29న మూలానక్షత్రం, సరస్వతి పూజ, త్రిరాత్రి పూజ, 30న దుర్గాష్టమి, అక్టోబర్ 1న మహర్నవమి, 2న విజయదశమి రోజు శమీ పూజతో పాటు ప్రత్యేక సహస్రనామ పూజలు నిర్వహిస్తామని, ప్రతి రోజు భారీ అన్నసమారాధన జరుగుతుందని ఈఓ హరిసూర్యప్రకాష్ వివరించారు. మండలంలోని గోపవరంలో గుబ్బాలమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ, లోహియా నగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయసహిత రాజరాజేశ్వరిస్వామి, సింగవరంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల వద్ద దేవీ నవరాత్రలకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు.



భీమదొర తూము సెంటర్‌లో ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల అమ్మవారి విగ్రహం



పట్టణంలో చింతచెట్టు వీధిలో భారీ అమ్మవారి విద్యుత్ సెట్టింగ్



తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు



ఉత్సవాలకు ముస్తాబైన బ్రాహ్మణగూడెంలో ఆలయం

వెల్లివిరుస్తున్న ఉత్సవ శోభ

చాగల్లు: మండలంలో దసరా ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు, మండపాలు వద్ద వివిధ గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయల ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. చాగల్లు, మీనానగరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు అన్ని ముస్తాబు అయ్యాయి.

చాగల్లు మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వార్షికోత్సవ మహోత్సవాలకు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వ వరకు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఆలయంలో ఉత్సవ వేడుకలకు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కుంకుమ పూజలు జరుగుతాయని, రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాళ్లపూడిలో తొమ్మిది అలంకారాలు

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో 22వ తేది నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శరన్నవ రాత్ర మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాళ్లపూడితో పాటు, వేగేశ్వరపురంలోని మేదర్ల ఆధ్వర్యంలో, గజ్జరం, తాడిపూడి, పైడిమెట్ట, అన్నదేవరపేట, మలకపల్లి తదితర గ్రామాల్లో నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనక దుర్గమ్మ ఆలయంలో 24వ దసరా మహోత్సవాలు 22 వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు నీలి సూర్యనారాయణ తెలిపారు. అమ్మవారికి 9 రోజులపాటు ప్రత్యేక అలంకరాలతో పూజలు నిర్వహించనునట్టు వెల్లడించారు. తాళ్లపూడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రిమాత మందిరంలోను 9 రోజులపాటు నవ రాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారన్నారు.

కూటమి చేసిన మేలు ఏమిటి.?

- ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగనామం
- కోఆర్డినేటర్ తలారి ధ్వజం

చాగల్లు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని, దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టారని తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ఆదివారం బ్రాహ్మణగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో రచ్చబండ ఏర్పాటు చేసి స్థానిక నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు 15 నెలల పాలనలో అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరించారు. సమావేశంలో తలారి వెంకట్రావు మాట్లాడుతూ గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే ప్రతి పంట నష్టానికి కేవలం 30 రోజుల్లో పరిహారాన్ని చెల్లించామని గుర్తుచేశారు. మరి కూటమి ప్రభుత్వం 2024 నుంచి రబీ, ఖరీఫ్ సీజన్లలో పంట నష్టాలను చెల్లించాదా..? ఉచిత పంటల బీమా కింద రైతుల పక్షాన ప్రీమియంను తమ ప్రభుత్వమే భరించింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పథకాన్నే ఎత్తేసిందన్నారు. కనీసం రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టినా లబ్ధిదారులకు సైతం పంటనష్టం బీమాను కూడా చెల్లించకపోవడం ఎంత దారుణం..? విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించారా..? వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించారా.? వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సక్రమంగా నిర్వహిస్తున్నారా.? ఎందుకు రైతులు గిట్టు బాటు రేటు కోసం రోడ్డెక్కుతున్నారు.? వీటికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతు సంక్షేమ సారథి వైఎస్ జగన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయిదేళ్ల పాటు రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందించామన్నారు. వ్యవసాయంలో రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన లబ్ధి మొత్తం రూ.1,70,845 కోట్లు అని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 53 లక్షల మంది అర్హులైన రైతులను గుర్తించి ఏటా రూ.13,500 చొప్పున రైతు భరోసాను అందించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరం ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం రూ.10,716 కోట్లు ఎందుకు ఎగ్గొట్టారో చెప్పాలని ప్రశ్నించారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో ఆపరేటర్లు వీధుల పాలయ్యారని తలారి అగ్రహం వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ ఉపాధ్యాక్షుడు అత్కూరి దొరయ్య, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమిసోమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ ఆర్టీఏ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి సూరిబాబు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మడు, కుదప రాంబాబు, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, అయినం నాగరాజు, బ్రాహ్మణగూడెం గ్రామ నాయకులు ఉండవల్లి శ్రీనివాసరావు, పొన్నాడ సింహాద్రి, ఎల్లె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణగూడెంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు



సభకు హాజరైన గ్రామస్తులు

జీఎస్టీ నిబంధనలు పాటించాలి

- అతిక్రమిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు
- తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

చాగల్లు: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేది నుంచి తగ్గిన జీఎస్టీ నిబంధనలకు అనుగుణంగా వినియోగదారులకు వస్తువులను ఎమ్ఆర్పీ ధరలకే దుకాణదారులు విక్రయించాలని కొవ్వూరు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ జివి ప్రసాద్ తెలిపారు. చాగల్లు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం మండలంలో రేషన్ షాపుల్లో వాడే కాటాలను తనిఖీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల శ్లాబ్‌లు తగ్గించినందున అనేక రకాల వస్తువులు, నిత్యవసరాలు, ఇతర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని వినియోగదారులు గమనించాలని తెలిపారు. కొత్త జీఎస్టీ శ్లాబ్‌కు అనుగుణంగా దుకాణదారులు అమ్మకాలు చేసేలా కిరణామర్చంట్ అసోసియేషన్, వ్యాపార వర్తక సంఘాల వారికి ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. రైతులకు ఏరువులు విక్రయాల్లో ధరలు, కొలతల్లో వ్యత్యాసాలు వస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఏడాదికోకసారి దుకాణదారుల కాటాలను పరిశీలించి సీల్ వేస్తామని చెప్పారు. వ్యాపార దుకాణాల్లో తూనికలకు వాడే కాటాలకు ముద్ర (సీల్) లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కిరణా దుకాణాలు, చికెన్ సెంటర్లు, రేషన్‌షాపులు తూనికల్లో తేడాలు వస్తే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కమల్, సిబ్బంది ఉన్నారు.



చాగల్లులో రేషన్ దుకాణాల కాటాలను పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డును కాస్త పట్టించుకోండి

- రోడ్డు నిర్మాణంపై ప్రజా సంఘాల డిమాండ్

దేవరపల్లి: ప్రభుత్వాలు మారినా త్యాజంపూడి – యర్నగూడెం ఆర్అండ్‌బీ రహదారి సమస్యకు పరిష్కారం లభించడంలేదని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని త్యాజంపూడిలో ఆదివారం డీవైఎఫ్ఐ నాయకుడు గట్టెం నాని అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో గట్టెం నాని, నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే వెంకట్రాజు ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు కాలేదని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా రోడ్డుకు మోక్షం లభించలేదని ఆరోపరించారు. దాదాపు 10 ఏళ్లుగా రెండు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డు పునర్ నిర్మాణం చేయకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు నడికట్ల రామారావు, సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, డీవైఎఫ్ఐ నాయకులు పరపతి సోమశేఖర్, బండి నాని పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు

ఆక్రమణల తొలగింపు బాధ్యత పంచాయతీదే

దేవరపల్లి: గ్రామంలో ఆక్రమణల తొలగింపు బాధ్యత పంచాయతీ కార్యదర్శిదేనని మండల తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను పట్టించుకోరా..! అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. దేవరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములు ముఖ్యంగా స్మశాన భూమి, యాదవోలు రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్ వరకు గల ప్రధాన రహదారిపై గల ఆక్రమణలు తొలగించాలని గ్రామ జేఏసీ సభ్యులు దున్న సుమన్ బాబు, తదితరులు పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులకు పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించినట్టు ఆయన తెలిపారు. అర్జీల విచారణ అనంతరం గ్రామ స్మశాన వాటిక సర్వే నెంబరు 1051/1లో విస్తీర్ణం 77 సెంట్లు, సర్వే నెంబరు 1295లో 1.24 ఎకరాల భూమికి మండల సర్వేయర్ ద్వారా జూలై 2వ తేదీన పంచాయతీ, అర్జీదారుల సమక్షంలో భూమిని సర్వే చేసి, హద్దులు చూపించి మార్కింగ్ ఇచ్చినట్టు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 53 ప్రకారం ఏదైనా రహదారి పంచాయతీ గుండా వెళ్తే సదరు రహదారిపై ఆక్రమణలను పంచాయతీ అధికారులే తొలగించవలసి ఉంటుందన్నారు. ఈ విషయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కోరినట్లయితే మండల సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు చూపిస్తామన్నారు. సమస్య పరిష్కారానికి తదుపరి చర్యలను గ్రామ పంచాయతీ కార్యదర్శినే తీసుకోవలసి ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

సాక్షి ఇంపాక్ట్: కదిలిన అధికార యంత్రాంగం

తాళ్లపూడి: ఈ నెల 18వ తేదీన సాక్షిలో అధ్వానంగా మారిన రోడ్డు అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికార యంత్రాగం స్పందించింది. మండంలోని పైడిమెట్ట వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు భారీ గోతులు పడి దారుణంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు దుస్థితిపై సాక్షిలో కథనం ప్రచురితమవ్వడంతో ఆదివారం తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు చదును చేస్తున్న పొక్లెయిన్

అవార్డు పొందడం అదృష్టం

సీటీఆర్ఐ: ఎన్టీఆర్ జాతీయ అవార్డు పొందడం తన అదృష్టమని ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీర్నాల కృష్ణ అన్నారు. విశాఖపట్నానికి చెందిన దాసరి నారాయణ రావు కల్చరల్ అకాడమీ జాతీయ వార్షికోత్సవాల సందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కళాకారుడు కృష్ణకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందజేశారు. అదే వేదికపై విశాఖరత్న కల్చరల్ అసోసియేషన్ నుంచి కళాసేవా రత్న అవార్డు కూడా ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయనకు ఎంపీ పురందేశ్వరి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, జిల్లా బేడ బుడగ జంగాల అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణను అభినందిస్తున్న ఎంపీ తదితరులు

రోగులకు వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

పెరవలి: మండలంలోని లంకమాలపల్లిలో ఆదివారం లూథరన్ చర్చిలో తణుకు పట్టణానికి చెందిన ఎల్‌బీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 186 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 8 వృద్ధులకు మెరుగైన వైద్యం అవసరమని సూచించారు. కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులతో భాదపడేవారికి ఎటువంటి ఆపరేషన్ లేకుండా కేవలం ఇంజక్షన్‌తో వైద్యం అందిస్తున్నామని వైద్యులు ఎస్.శివ కుమార్ తెలిపారు. ప్రతి నెలా ఏదో ఒక గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు మందులు, పరీక్షలు చేస్తున్నామని వివరించారు.

సిద్ధాంతికి డాక్టరేట్ ప్రదానం

నిడదవోలు: హైదరాబాద్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి పొన్నా సుబ్రహ్మణ్యంకు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డుతో సత్కరించారు. హైదరాబాద్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తలంశెట్టి శ్రీనివాస్

నల్లజర్ల: స్వలాభం మానుకొని ఆలయ అభివృద్ధికి అందరూ పాటుపడాలని చీపురుగూడెం గ్రామానికి చెందిన తుమ్మాలమ్మ ఆలయకమిటీ చైర్మన్ తలంశెట్టి శ్రీనివాస్ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చీపురుగూడెం గ్రామం తుమ్మాలమ్మ ఆలయం దిగువ గుడికి సంబంధించి గ్రామంలోని తలంశెట్టి వంశస్తులు ఆలయం ద్వారా వచ్చే ఆదాయాన్ని అమ్మవారి ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. సంవత్సరం పొడవునా ఆలయంపై వచ్చే ఆదాయం అమ్మవారి ధూపదీప నైవేద్యాలకు సరిపోతుందని ఈ విధంగా వచ్చే సొమ్ములో రూ.1లక్షా 50 వేలు తలంశెట్టి కోటేశ్వరరావు వద్ద నిల్వ ఉందని ఆ సొమ్ముతో వంటషెడ్డు నిర్మాణం చేపట్టాలనుకున్నామన్నారు. కానీ ఆయన ఆ సొమ్ము కమిటీకి అప్పగించకుండా కమిటీ సభ్యులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. అమ్మవారి సొమ్ము ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న కోటేశ్వరరావుపై తగు చర్యలు తీసుకోవాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్ శ్రీనివాస్‌తో పాటు సభ్యులు గాలింకి రాంబాబు, చెల్లు శ్రీహరి, తలంశెట్టి గంగారావు, సత్యనారాయణ, సాయిబాబు, సీతారామయ్య, దొప్పసాని వెంకట్రావు, చలారి శ్రీను తదితరులు భక్తులకు ఈ విషయాన్ని వెల్లడించారు.

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

నల్లజర్ల: మండల కేంద్రం నల్లజర్ల సొసైటీ చైర్మన్‌గా రావూరి వెంకటరమణ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఆదివారం స్థానిక ప్రియాంక కన్వెన్షన్ హాల్లో జరిగింది. ముఖ్య అతిథులుగా గోపాలపురం, దెందులూరు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, చింతమనేని ప్రభాకరరావు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తదితరులు హాజరయ్యారు.